AP 4PG 28 - 4- 2026 TUESDAY qxp_Layout 1 28-04-2026 09:53 AM Page 2



## పెట్రోల్ బంకులపై తహసీల్దార్ ఆకస్మిక తనిఖీలు



యాడికి, ఏప్రిల్ 27 (అనంత ప్రభ )

యాడికి మండలంలోని పెట్రోల్ బంకులను తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి సోమవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. పెట్రోల్, డీజిల్ నిల్వలు, రికార్డులను పరిశీలించి సరఫరా విధానంపై ఆరా తీశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగినంత నిల్వలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని బంకు నిర్వాహకులకు సూచించారు. మండలంలోని నాలుగు పెట్రోల్ బంకుల్లో ప్రస్తుతం సుమారు 20 వేల లీటర్ల పెట్రోలు, 33 వేల లీటర్ల డీజిల్ నిల్వలు ఉన్నాయని తెలిపారు. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, అవసరమైన మేరకే ఇంధనం వినియోగించాలని సూచించారు

## గో రక్షణ చర్యలు చేపట్టాలని వినతి



యాడికి, ఏప్రిల్ 27 (అనంత ప్రభ)

గో రక్షణ చర్యలను చేపట్టాలని కోరుతూ సోమవారం యాడికి మండల తహసిల్దార్ ప్రతాప్ రెడ్డికి వీహెచ్‌పీ, బీజేపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. గో సంతతిని కాపాడి, ఎద్దులను వ్యవసాయానికి వినియోగించేలా చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని, ముసలి ఆవులు, ఎద్దులను సేకరించి గోశాలలు ఏర్పాటు చేయాలని, వాటి నిర్వహణకు ప్రత్యేక నిధి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. గో ఆధారిత ఉత్పత్తులకు మాల్స్‌లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. గోవుల అక్రమ రవాణాపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ డిమాండ్లను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు పంపించాలని తహసిల్దార్ ను కోరారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ అధ్యక్షులు తిరంపురం లక్ష్మయ్య, యాడికి మండల బీజేపీ అధ్యక్షులు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు

## మొబైల్ మోజులో యువత విలువైన సమయం వృథా

యాడికి, ఏప్రిల్ 27 (అనంత ప్రభ)

విలువైన వేసవి సెలవులను కొంతమంది యువకులు మొబైల్ ఫోన్ల మోజు, బాధ్యతల పట్ల నిర్లక్ష్యం, చెడు అలవాట్లతో వృథా చేసుకుంటున్నారని పెద్దలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సద్వినియోగం చేసుకోవాల్సిన సమయంలో కొందరు యువత కాలక్షేపానికే పరిమితమవుతున్నారని పేర్కొంటున్నారు. ఒకవైపు వృద్ధ తరం కుటుంబ భారం మోస్తూ కష్టపడి కుటుంబాలను నిలబెడుతుంటే, మరోవైపు చేయూతనివ్వాల్సిన వయస్సులో కొందరు యువకులు అలసత్వానికి అలవాటు పడుతున్నారని అంటున్నారు. శ్రమకు దూరమై లక్ష్యం లేని జీవితం వైపు అడుగులు వేస్తున్నారని అభిప్రాయపడుతున్నారు. పెద్దల పట్ల గౌరవం, మంచి చెడు మధ్య తేడా తెలుసుకునే వివేకం వంటి విలువలు తగ్గిపోతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. చెడు స్నేహాలు, వ్యసనాలు, నిర్లక్ష్య జీవనశైలి యువత భవిష్యత్తుతో పాటు సమాజ స్థిరత్వానికీ ముప్పుగా మారుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. యువత కుటుంబం, సమాజం పట్ల తమ బాధ్యతను గుర్తించి సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని పెద్దలు సూచిస్తున్నారు. వేసవి సెలవులను విద్య, ఉపాధి, సేవా కార్యక్రమాలు, ప్రతిభాభివృద్ధి వైపు మలుచుకుంటే భవిష్యత్తు బాగుంటుందని నిపుణులు తెలిపారు.

## అభివృద్ధే ఆకర్షణ... బీజేపీలోకి వరుసగా చేరుతున్న కుటుంబాలు



బత్తలపల్లి, ఏప్రిల్ 27 (అనంత ప్రభ)

ధర్మవరం నియోజకవర్గం, బత్తలపల్లి మండలం, తంబాపురం గ్రామంలో సోమవారం రాజకీయంగా కీలక పరిణామం చోటుచేసుకుంది. వైఎస్సార్సీపీకి చెందిన స్థానిక నాయకులు బ్యాళ్ల ఆదినారాయణ, రవీంద్ర ఆచారి ఆధ్వర్యంలో సుమారు 20కి పైగా కుటుంబాలు భారతీయ జనతా పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు కొత్తగా చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అంతకుముందు తంబాపురం గ్రామంలో మన ఊరు -- మన జెండా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక బీజేపీ నాయకులతో కలిసి హరీష్ బాబు బీజేపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ.... ధర్మవరం నియోజకవర్గంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్, చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సేవలు మరియు బీజేపీ సిద్ధాంతాల పట్ల ఆకర్షితులై అనేక కుటుంబాలు స్వచ్ఛందంగా బీజేపీలో చేరుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన ప్రతి కుటుంబానికి బీజేపీ తరఫున హృదయపూర్వక స్వాగతం తెలిపారు. అలాగే మంత్రి సత్యకుమార్ యాదవ్ గారి ఆధ్వర్యంలో ధర్మవరం నియోజకవర్గంలో అమలవుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ముఖ్యంగా రైతుల అభివృద్ధి కోసం బత్తలపల్లి మండలంలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు, సంస్కృతి సేవా సమితి సౌజన్యంతో 1000 మందికి ఉచిత కంటి పరీక్షలు, 396 మందికి కంటిశుక్లం (క్యాటరాక్ట్) శస్త్రచికిత్సలు, నియోజకవర్గంలోని 2000 మంది ప్రభుత్వ పదవ తరగతి విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ, నిరుద్యోగ యువత కోసం ఉద్యోగ మేళాలు నిర్వహణ, బ్యాంకింగ్ మరియు ఐఏఎస్ కోచింగ్ కార్యక్రమాలు, వికలాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ ఈ అభివృద్ధి కార్యక్రమాల వల్ల ధర్మవరం నియోజకవర్గం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని ఆయన పేర్కొన్నారు. ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, మౌలిక వసతులు వంటి రంగాల్లో సమగ్ర పురోగతి కనిపిస్తోందన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, పారదర్శకంగా అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడం మంత్రి సత్యకుమార్ యాదవ్ గారి నాయకత్వానికి ప్రత్యేకత అని హరీష్ బాబు గారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో బత్తలపల్లి మండలం బీజేపీ అధ్యక్షులు ఆకులేటి భాస్కర్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబిలేసు,మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి కోటి సుధా, మాజీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు, బత్తలపల్లి మండలం సింగిల్ విండో చైర్మన్ ఆకులేటి వీరనారప్ప, డీ చెర్లోపల్లి నారాయణస్వామి, బీజేవైఎం నరేష్, కప్పల సుదర్శన్, కావేటి మల్లికార్జున, వెంకటేశ్వర్లు చౌదరి, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## ఆర్. డి. టీ మాంచు ఫెర్రర్ గారికి సన్మానం



అనంతపురం, ఏప్రిల్ 27 (అనంత ప్రభ)

అనంతపురం 27.04.2026 న గౌ"పద్మ శ్రీ మాదిగ గారి బ్యానర్ లో బి. సి. ఆర్.దాస్,మరిప్స్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆర్. డి. టీ.ఆఫీస్ ముందు , ఆర్. డి. టి డిమాండ్ అయిన యఫ్.వచ్చినందున గౌ" శ్రీ మాంచు ఫెర్రర్ గారికి సుమారు 100 మందితో సన్మానం చేయడం జరిగింది.

యఫ్. సి. ఆర్. ఏ.రావటానికి రాష్ట్ర ప్రభుత్వ గౌ" ముఖ్యమంత్రి గారైన శ్రీ చంద్ర బాబు నాయుడు గారు గౌ" ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ గారికి యఫ్. సి. ఆర్. ఏ.విషయంలో కేంద్ర ప్రభుత్వం తో పలు మార్లు చర్చించి యఫ్. సి. ఆర్. ఏ.అనంతపురం ఉమ్మడి జిల్లా ప్రజలు తరుపున కృతజ్ఞతలు అందజేస్తున్నాం. ఇక యఫ్. సి. ఆర్. ఏ.రావటానికి గ్రామాలు , పట్టణాలు జిల్లా కేంద్రం తో పాటు , దళిత గిరిజనుల ఆధ్యర్యంలో ధర్నా, పాలికేక వివిధ రూపాలలో యఫ్. సి. ఆర్. ఏ.విషయం పై నిరసనలు తెలియజేసిన వారికి మాంచు ఫెర్రర్ గారు కృతజ్ఞతలు అందజేశారు.

ఈ సన్మాన కార్యక్రమంలో బి. సి. ఆర్.దాస్,కుందుర్పి ఓబయ్య ,సూరి , శేఖర్ , నాగరాజు , దొడప్ప, సి ఎం నరసింహులు, కొండయ్య, నాగమ్మ , శాంతి , తిప్పన్న , పద్మావత తాడిపత్రి ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్,డీజల్ కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవు, డిటి ఉదయ్ భాస్కర్






కూడేరు, ఏప్రిల్ 27 (అనంత ప్రభ)

కూడేరు మండల కేంద్రంలో ఉన్నటువంటి పెట్రోల్ బంక్ నిర్వాహకులు పెట్రోల్, డిజన్ స్టాక్ లేదంటే కృత్రిమ కొరత సృష్టిస్తున్నరని వాహనదారులు వాపోతున్నారు. ఇంధన సరఫరా నేపథ్యంలో కొన్ని పెట్రోల్ బంకుల్లో నిలువలు కొద్దిగా తగ్గినప్పటికీ పెట్రోల్ బంక్ నిర్వాహకులు మాత్రం నో స్టాక్ బోర్డులు పెట్టి లాక్ ఓపెన్ కాలేదంటూ వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాహనదారుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దాంతో సమాచారం అందుకున్న రెవెన్యూ డిప్యూటీ తహశీల్దారు ఉదయ భాస్కర్ వెంటనే వారి సిబ్బందితో పెట్రోల్ బంకులను తనిఖీ చేయాగా పెట్రోల్ బంక్ లో అవసరమైన నిలువలు ఉన్నట్టు గుర్తించామని వాహనదారులు ఎవరు ఇబ్బంది పడవద్దని పెట్రోల్ బంకు నిర్వాహకులు వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవని డిటి ఉదయ భాస్కర్ హెచ్చరించారు.

## ప్రాజెక్టులకు అన్యాయం చేస్తున్న కూటమి ప్రభుత్వం

- రైతు ప్రయోజనాల కోసం హంద్రీనీవా ప్రధాన కాలువ వెడల్పు చెయ్యాలి
- రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ కోసం పోరాటం తప్పదు,మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్




పుట్టపర్తి, ఏప్రిల్ 27 (అనంత ప్రభ)

ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే పిఏసి మెంబర్ వై. విశ్వేశ్వర్ రెడ్డి సత్యసాయి జిల్లా లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు--సమాలోచన సమావేశానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రాయలసీమ అభివృద్ధికి కీలకమైన లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు సాధన కోసం ప్రతి ఒక్క రాయలసీమ బిడ్డ సిద్ధంగా ఉండాలని వై విశ్వేశ్వర్ రెడ్డి గారు పిలుపునిచ్చారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రాంతంలో ఉన్న నీటి కొరత సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.రైతుల సంక్షేమం, ప్రాంతీయ సమతుల్య అభివృద్ధి దృష్ట్యా ఈ ఉద్యమం అత్యంత అవసరమని ఆయన తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ఈ ఉద్యమంలో పాల్గొని, రాయలసీమ హక్కుల సాధన కోసం ముందుకు రావాలని కోరారు.రాబోయే కార్యక్రమాల్లో ప్రజలు భారీగా పాల్గొని ఉద్యమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రివర్యులు సింగనమల నియోజకవర్గ సమన్వయకర్త, డాక్టర్ సాకే శైలజానాథ్ , మాజీ మంత్రివర్యులు ఉషశ్రీ చరణ్ , మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి , కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి , తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి , టిఎన్ దీపిక , ఎస్ ఎల్ ఈరలక్కప్ప , అసెంబ్లీ నియోజకవర్గాల పరిశీలకులు, పీఏసీ, సీఈసీ, ఎస్ఈసీ సభ్యులు, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు, పార్టీ రాష్ట్ర, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, అనుబంధ విభాగాల కమిటీ సభ్యులు, జిల్లా పార్టీ కమిటీ సభ్యులు, నగర, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు ఇతర నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అనంతపురం నగరపాలక సంస్థ ఔట్ సోర్సింగ్ నియామకాల్లో గిరిజనులకు తీవ్ర అన్యాయం

### జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన ఎరుకల యువ సైన్యం పోలా వీరాంజనేయులు



అనంతపురం, ఏప్రిల్ 27 (అనంత ప్రభ)

అనంతపురం నగరపాలక సంస్థలో జరుగుతున్న ఔట్ సోర్సింగ్ నియామకాల్లో గిరిజన అభ్యర్థులకు జరుగుతున్న తీవ్ర అన్యాయంపై ఈరోజు "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" నందు జిల్లా కలెక్టర్ శ్రీ ఓ. ఆనంద్ కుమార్ గారికి ఎరుకల యువ సైన్యం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పోలా వీరాంజనేయులు వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఔట్ సోర్సింగ్ నియామకాల్లో గిరిజనులకు 6 శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సి ఉండగా, నగరపాలక సంస్థ అధికారులు ఆ నిబంధనలను పూర్తిగా పక్కన పెట్టారని ఆరోపించారు. కార్పొరేషన్ లోని పబ్లిక్ హెల్త్ విభాగంలో మొత్తం 409 పోస్టులకు గాను రిజర్వేషన్ ప్రకారం 25 పోస్టులు దక్కాల్సి ఉండగా, కేవలం 3 పోస్టులు మాత్రమే ఇచ్చారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఇంజనీరింగ్ విభాగంలో 309 పోస్టులకు గాను 19 పోస్టులు రావాల్సి ఉండగా, అక్కడ కూడా కేవలం 3 పోస్టులకే పరిమితం చేశారని తెలిపారు.

మొత్తం మీద గిరిజనులకు దక్కాల్సిన 44 పోస్టులకు గాను కేవలం 06 పోస్టులు మాత్రమే కేటాయించి, మిగిలిన 38 పోస్టుల విషయంలో నిరుద్యోగ గిరిజన యువతకు తీవ్ర అన్యాయం చేశారని ఆయన మండిపడ్డారు. ఈ వ్యవహారంపై స్పందించిన జిల్లా కలెక్టర్ గారు సానుకూలంగా స్పందిస్తూ, నియామకాలపై సమగ్ర విచారణ జరిపి గిరిజనులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని వీరాంజనేయులు తెలిపారు. రాజ్యాంగబద్ధంగా రావాల్సిన రిజర్వేషన్లను కాలరాసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశాం

## జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ని కలిసిన నూతన అసిస్టెంట్ కలెక్టర్ సుయశ్ కుమార్..



అనంతపురం, ఏప్రిల్ 27 (అనంత ప్రభ)

అనంతపురం జిల్లాకి నూతన అసిస్టెంట్ కలెక్టర్ సుయశ్ కుమార్ సోమవారం విచ్చేశారు. అనంతపురం కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ని నూతన అసిస్టెంట్ కలెక్టర్ సుయశ్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. ప్రభుత్వ ఆదేశాలతో దాదాపు ఏడాది పాటు ఆయన జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్ గా వివిధ శాఖల పనితీరు గురించి శిక్షణ తీసుకుంటారు.

- నూతన అసిస్టెంట్ కలెక్టర్ వివరాలు..

స్వస్థలం : ఉత్తరప్రదేశ్ రాష్ట్రంకి చెందినవారు..

- విద్యాభ్యాసం : బిటెక్, ఐఐటి (బనారస్ హిందూ యూనివర్సిటీ), వారణాసి.
- 2025 ఐ.ఏ.ఎస్ బ్యాచ్.
- ముస్సోరీలోని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ (ఐ.ఏ.ఎస్. అధికారుల శిక్షణ సంస్థ) నుంచి ఫేస్1 శిక్షణ పూర్తి చేసుకుని జిల్లాకు విచ్చేశారు

## తాగునీటి ఎద్దడి పై ముందస్తు చర్యలు చేపట్టిన ఎంపీడీవో



ఆత్మకూరు, ఏప్రిల్ 27 (అనంత ప్రభ)

ఆత్మకూరు మండలం వేపచెర్ల దిగుతాండ, ఎగువతాండ, వేపచెర్ల గ్రామములలో సోమవారం రోజున ఎంపీడీవో జి. లక్ష్మీ నరసింహ ఏ ఈ ఆర్డబ్ల్యూఎస్ శివకుమార్ తో కలిసి గ్రామాలను సందర్శించడమైనది. త్రాగునీటి సమస్యలు ఏర్పడకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి పంచాయతీ కార్యదర్శులతోను సచివాలయ సిబ్బందితోను గ్రామ ప్రజలతోను చర్చించారు. వేసవికాలంలో రాబోయే నీటి ఎద్దడిని నివారించడానికి ఎప్పటికప్పుడు సమీక్షించుకుని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ద్వారా చేపట్టిన జలధార జలహారతి కార్యక్రమంలో భాగంగా గుర్తించిన పనుల పై చర్చించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శిరీష, మహిళా సంరకురాలు కుమారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పెట్రోల్ బంక్ ని తనిఖీ చేసిన తహశీల్దార్ శేషారెడ్డి



శింగనమల, ఏప్రిల్ 27 (అనంత ప్రభ)

శింగనమల మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ ని తహశీల్దార్ శేషారెడ్డి అకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది.వీఆర్ఓ తాతయ్య ఆధ్వర్యంలో తనిఖీ చేశారు.ఈ తనిఖీల్లో పెట్రోల్ బంక్ మూతవేసి ఉండడంతో ఎందుకు మూత వేశారని,స్టాకు ఏందుకు తెచ్చుకోలేదని ప్రశ్నించడం జరిగింది. ఎంత స్టాక్ ఉంది అనేదానిపై తనిఖీ చేసినట్లు తెలియజేశారు.వెంటనే వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పెట్రోల్ డీజిల్ తెప్పించాలని పెట్రోల్ బంక్ యజమానులకు హెచ్చరించడం జరిగింది

## జాతీయ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు వై వి బి రాజేంద్రప్రసాద్ కలిసిన రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ కార్యనిర్వాక కార్యదర్శి దేగల కృష్ణమూర్తి



శింగనమల, ఏప్రిల్ 27 (అనంత ప్రభ)

తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు వైవిబి రాజేంద్రప్రసాద్ విజయవాడ లోని పెనుమనూరు నియోజకవర్గం ఉయ్యూరు లో అనంతపురం తెలుగుదేశం పార్టీ మాజీ ఉపాధ్యక్షులు రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి దేగల కృష్ణమూర్తి మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది ఈ సందర్భంగా జాతీయ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులుగా ఎన్నికైన వై వి బి రాజేంద్రప్రసాద్ శాలువా మొమెంటుతో ఘనంగా సత్కరించడం జరిగింది ఈ కార్యక్రమంలో విజయవాడ తెలుగు యువత నాయకులు నరేంద్ర తదితరులు పాల్గొన్నారు

## జిల్లా పోలీస్ కార్యాలయం పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ కార్యక్రమంలో 150 పిటీషన్లు స్వీకరణ



అనంతపురం, ఏప్రిల్ 27 (అనంత ప్రభ)

అనంతపురం జిల్లా ఎస్పీ శ్రీ పి. జగదీష్ ఈరోజు స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ గారు ప్రజల నుండి వివిధ సమస్యలపై 150 అర్జీలను స్వీకరించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, వాటిని తక్షణమే పరిశీలించి చట్టపరిధిలో పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా...ఈ కార్యక్రమానికి హాజరైన పిటిషనర్లు మరియు వారి వెంట వచ్చిన వారికి ఇస్కాన్ సంస్థ వారి సహకారంతో ఉచిత భోజన ఏర్పాట్లు చేయడం జరిగింది. పోలీసు అధికారులు పాల్గొని స్వయంగా వారే భోజనం వడ్డించారు. ఈసందర్భంగా ప్రజలు జిల్లా పోలీస్ యంత్రాంగానికి మరియు ఇస్కాన్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పిజిఆర్ఎస్ కార్యక్రమంలో అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు